క్లుప్తంగా

ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలి



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుండడంతో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో రోడ్డు సైడు చిన్న వ్యాపారస్తుల సంఘం మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ..ట్రాఫిక్ పెరిగిపోతుండడంతో రోడ్డు సైడు వ్యాపారాలు చేసుకోవడానికి కార్మికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు, సీహెచ్ సాయిబాబా, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : ఆదోని పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో చదువుతూ అస్వస్థత గురైన బాలికలకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం డీఆర్వో చిరంజీవిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ హాస్టల్‌లో 132 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, అక్కడ మెనూ ప్రకారం భోజనం అందించడంలేదన్నారు. బాలికలకు ఉడికీఉడకని అన్నం పెడుతున్నారని, తాగడానికి నీళ్లు కూడా లేవన్నారు. దీంతో వారు తరచూ అస్వస్థతకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం కలగజేసుకొని వసతులు మెరుగు పరచాలని కోరారు.

అదనపు ఫ్లోర్లపై టౌన్‌ప్లానింగ్ ఆరా


అనుమతి లేని అదనపు ఫ్లోర్ నిర్మాణాలను తనిఖీ చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు లేకుండా అదనంగా నిర్మించిన నిర్మాణాలపై నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ముఖ్య కూడళ్లు, కాలనీల్లో టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా పలువురు అదనపు ఫ్లోర్లు నిర్మించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ రవీంద్రబాబు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు రాఘవేంద్ర నగర్‌లో పర్యటించారు. నరసింగరావు పేటలో అనుమతి లేకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి తొలగించారు. అలాగే నరసింహ రెడ్డి నగర్‌లో కూడా నిర్మాణ పనులను నిలిపి వేశారు. ఆయా తనిఖీల్లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు శబరీష్, దామోదర్, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు..

స్వచ్ఛతలో భాగస్వామ్యం కండి


ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): స్వచ్ఛత కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా దామోదరం సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు కొండారెడ్డి బురుజు, కంట్రోల రూమ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వచ్చే నెల 2 వ తేదీ వరకు ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేద్దామని పిలుపు నిచ్చారు. శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, టీపీ ఆర్ ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఉద్యోగుల బదిలీ

కర్నూలు న్యూసిటీ : విద్యుత్ శాఖలో జిల్లా పరిధిలో ఆరుగురు జేఎల్ఎమ్ గ్రేడ్ –2 ఉద్యోగులను బదిలీ చేశారు. ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి శనివారం వారికి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

నేడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల రాక

కర్నూలు(అర్బన్): జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (న్యూఢిల్లీ) సభ్యులు జటోతు హుస్సేన్ నేడు కర్నూలుకు రానున్నారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు వెనుకనున్న వెంకట చలపతి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లు ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులతో సమావేశమై వారి అభ్యర్థనలను స్వీకరించనున్నారు.

చైతన్యమూర్తి గురజాడ

కర్నూలు(సెంట్రల్) : సాహిత్యంతో సమాజాన్ని చైతన్య పరిచిన మహాకవి గురజాడ వెంకట అప్పారావుకు దక్కుతుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గురజాడ అప్పారావు 162వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..దేశభక్తి, ఆధునిక కవిత్వం, సంస్కరణలు, సంఘ చైతన్యం వంటి భావాలతో వాడుక భాషలో రచనలు చేసి ప్రజలను చైతన్య పరచారని కొనియాడారు. గిడుగు రామ్మూర్తి పంతులతో కలిసి అనేక సంఘం సంస్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, సాంఘిక దురాచాలపై అవిశ్రాంత పోరాటాలు చేశారని పేర్కొన్నారు. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందిందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చిరంజీవి, సమాచార, పౌరసంబంధాల శాఖ డీడీ జయమ్మ పాల్గొన్నారు.


గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే నివారణ

కర్నూలు(హాస్పిటల్): చైల్డ్‌హుడ్ క్యాన్సర్(చిన్నతనంలో వచ్చే క్యాన్సర్)ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నివారణ సాధ్యమని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా చెప్పారు. శనివారం విశ్వభారతి వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో చైల్డ్‌హుడ్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు మారథాన్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ అనేది పెద్ద వారిలోనే గాక చిన్నపిల్లల్లో వచ్చే అవకాశం ఉంటుందని, అలాంటి సమయంలో భయాందోళనకు గురిగాకుండా ప్రారంభ దశలో వాటిని గుర్తించి అందుకు తగిన చికిత్సను తీసుకోవడం ద్వారా చిన్నారులు త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏ జబ్బు అయినా ఒక వారం రోజులు ఇబ్బంది పెడుతుంటే అందుకు తగిన చికిత్స తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వభారతి ఆసుపత్రి సీఈవో డాక్టర్ కాంతారెడ్డి, డాక్టర్ నిహారిక, డాక్టర్ కాశీభారతి, వైద్య సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


చైల్డ్ క్యాన్సర్ అవగాహన ర్యాలీలో కలెక్టర్ రంజిత్‌బాషా, వైద్యులు

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నివారణ

కర్నూలు(హాస్పిటల్): పిల్లలు, గర్భిణిలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శనివారం ఆయన నగరంలోని గడ్డ యూపీహెచ్‌సీ పరిధిలోని దండగేరి సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం తల్లులు, గర్భిణులతో ఆయన మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ కోసం గర్భిణిలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాల గురించి వివరించారు. ఎంసీపీ కార్డులో గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ జన్మించే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సాధారణ పరీక్షలు, రక్త పోటు, మూత్రపరీక్షలు చేయించుకోవాల్సిన సమయాలు ఉన్నాయన్నారు. గర్భిణి నవమాసాలు మోసి బిడ్డ ప్రసవించేనాటికి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సహాయం వంటి పథకాల వివరాలు సైతం ఎంసీపీ కార్డులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఎంసీపీ కార్డు గురించి వివరిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

నగరపాలక అదనపు కమిషనర్‌గా కృష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక అదనపు కమిషనర్‌గా ఆర్.జీ.వి. కృష్ణను ప్రభుత్వం నియమించింది. గ్రేడ్–1 కమిషనర్‌గా పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేసి, ఇక్కడ పనిచేస్తున్న అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్‌ను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌గౌడ్‌ను డోన్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. గ్రేడ్–2 స్థాయిలో కమిషనర్‌గా పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎం.క్రిష్ణను ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. శనివారం రాత్రి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌జీఎఫ్ నూతన కార్యాలయం ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో శనివారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యాలయంలో ఫర్నీచర్‌ను క్రీడా దాత శ్రీధర్ రెడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు అంటే తనకు ఆసక్తి అని, అందుకే క్రీడాకారులకు తన వంతు సాయం చేసి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



తయారు చేసిన వంట పదార్థాలతో విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ప్రపంచ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కేవీఆర్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు రకరకాల వంటలను రుచి కరంగా తయారు చేసి శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి పి. విజయ మాట్లాడుతూ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు 27వ తేదీన నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవంలో అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు దండబోయిన పార్వతీ దేవి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల చేసిన వంటలను పరిశీలిస్తున్న అతిథులు

సోషల్ మీడియా ఔత్సాహికుల సమావేశం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సోషల్ మీడియా ఔత్సాహికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంత సోషల్ మీడియా ప్రముఖ్, ప్రాంత ప్రచార టోలీ సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు ప్రధాన వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

సి.బెళగల్: ఇసుకను అక్రమంగా రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. శనివారం ఉదయం పోలీస్ సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. తుంగభద్ర నదీతీర గ్రామమైన తిమ్మందొడ్డి నుంచి ఇసుకను తరలిస్తున్న నాగులదిన్నె, ఎమ్మిగనూరుకు చెందిన ఉరుకుందు, మాబాషాల ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరిత

కర్నూలు (హాస్పిటల్): ఆధునిక వైద్య విధానాలు అందరికీ అందుబాటులో ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి చెప్పారు. శనివారం సాయంత్రం స్థానిక మౌర్యా ఇన్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెంట్ రిప్రొడక్షన్ పేరుతో రాష్ట్ర సదస్సు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి తల్లి మాతృత్వాన్ని కోరుకుంటుందని తెలిపారు. ఈ మేరకు కర్నూలులో సంతాన సాఫల్య కేంద్రాలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. అయితే ఆధునిక వైద్యసేవలు పేదలకు, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఆశా భక్షి, రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత యారాసి, ఐఎంఏ సెక్రెటరి డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఫాక్షి ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ విష్ణుప్రియ, సెక్రటరీ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పద్మజ, డాక్టర్ శిరీషా రెడ్డి, డాక్టర్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): కర్నూలు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి విజయ్, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొన్నారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, విద్యార్థినీ క్రీడల్లో పాల్గొనాలన్నారు. దీని వల్ల చురుకుదనం పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మండల స్థాయి పోటీలకు క్రీడాకారులను తయారు చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ పుల్లన్న, కర్నూలు నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు సుంకన్న పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో..

జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు శనివారం స్టేడియంలో ప్రారంభమయ్యాయి. అండర్–14, అండర్ 17 విభాగాల్లో ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, సెపక్‌తక్రా, కరాటే పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ హనుమంతరావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలంటే క్రీడలు అవసరమన్నారు. చదువుతో పాటు క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు.


రింక్‌లో బాల్ వేస్తూ మండల స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న శ్రీధర్ రెడ్డి

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- అత్యుత్సాహం ప్రదర్శించిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు

కర్నూలు (రూరల్): నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో మహిళా ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మపై నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమక్షంలోనే టీడీపీ సభ్యులు దురుసుగా ప్రవర్తించారు. ఎమ్మెల్యే కనీసం వారిని వారించకుండా మిన్నకుండిపోయారు. మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మాణాలు చేసుకునేందుకు మండల పరిషత్ అభివృద్ధి నిధులు రూ.2 కోట్లను ఒక ఎంపీటీసీ సభ్యునికి రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తామని సమావేశంలో ఎంపీపీ ప్రకటించగానే టీడీపీ ఎంపీటీసీ సభ్యులు రచ్చరచ్చ చేశారు. మెజారీ ఉన్న సభ్యులకే నిధులు కేటాయించాలని వాగ్వాదానికి దిగారు. ఈ గొడవతో మండలంలోని అన్ని శాఖల ప్రత్యేక అధికారులు ఒకింత విస్మయానికి గురయ్యారు. నిధుల కేటాయింపు సమావేశంలో అరుపులు, కేకలు తారాస్థాయికి చేరడంతో గంటలోపే ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించారు.


ఎంపీపీ వెంకటేశ్వరమ్మతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ ఎంపీటీసీ సభ్యులు

దళితులపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

- గోవిందమ్మపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నిత్యం దళితులపై దాడులు జరుగుతున్న నివారించడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందని వక్తలు అభిప్రాయపడ్డారు. పెద్దకడబూరు మండలం కల్లుకంటలో దళిత మహిళ గోవిందమ్మను వివస్త్రను చేసి దూషించిన సంఘటనపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం కార్మిక, కర్షక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దళిత మహిళను ఘోరంగా అవమానించిన సంఘటనపై పోలీసులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొంతమందిపై మాత్రమే కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. గోవిందమ్మ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు మరోసారి దాడి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, దళితులపై జరుగుతున్న దాడులపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు మాట్లాడుతూ..గోవిందమ్మపై దాడి చేసిన వారందరిపై కేసు నమోదు చేయకపోతే సెప్టెంబర్ 27వ తేదీన ఆదోని ఆర్‌డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళ ఐక్య వేదిక నాయకులు సుమలత, ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాదిగ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగనప్ప, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరాముడు, ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ పాల్గొన్నారు.

అక్టోబర్ 27, 28 తేదీల్లో విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో రాష్ట్ర విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆర్‌యూలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఏబీవీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ ఏర్పడి 16 సంవత్సరాలు అవుతున్నా రెగ్యులర్ బోధనేతర ఉద్యోగులు లేకపోవడంతో వర్సిటీలో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేసి వర్సిటీలను బతోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో గుంటూరులో నిర్వహించే రాష్ట్ర విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, ఏబీవీపీ నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

- 40వ వార్డులో పర్యటించిన కమిషనర్ రవీంద్రబాబు


బాలాజీనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం స్థానిక 40 వ వార్డు బాలాజీనగర్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహారెడ్డితో కలిసి కమిషనర్ వార్డులో పర్యటించారు. ప్రజలు, కార్పొరేటర్ తెలియజేసిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే తుంగభద్ర నది తీరాన పర్యటించి ఎస్టీపీకి (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) అనువైన ప్రదేశాలను పరిశీలించారు.

మంత్రి టీజీ భరత్‌ను కలిసిన కమిషనర్

రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌ను నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు కలిశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో మంత్రిని కలిసిన కమిషనర్ బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

వేదం శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వేదం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. వేదం నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 99636 27670 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

కర్నూలు కల్చరల్: బీక్యాంప్ విజ్ఞాన మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ×మహాలయ పక్షం విశిష్టత, పెద్దల అమావాస్య మహత్యం× అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని విజ్ఞాన మందిరం అధ్యక్షుడు కురాడి కంద్రశేఖర కల్కూర తెలిపారు. పేజావర మఠాదీశులు విశ్వ ప్రసన్న తీర్థ స్వామీజీ శిష్యుడు రవి తేజ ఉపన్యసిస్తాడని పేర్కొన్నారు.

ఆందోళనతోనే విద్యార్థినులకు అస్వస్థత

కర్నూలు(అర్బన్): ఆదోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో సహచర విద్యార్థినులు ఇరువురు అస్వస్థతకు గురికావడంతో మరో ఐదుగురు సహచర విద్యార్థినులు ఆందోళనతో స్వల్ప అస్వస్థతకు లోనయ్యారని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ అన్నారు. రెండు రోజుల పాటు ఆదోనిలో పూర్తిస్థాయి విచా రణ చేపట్టామని శనివారం సాయంత్రం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యులు కూడా ఐదుగురు విద్యార్థినులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, కేవలం ఆందోళనకు గురికావడం వల్లే ఇలా జరిగిందని చెప్పారన్నారు. 24 గంటల పర్యవేక్షణ అనంతరం శనివారం డిశ్చార్జి చేశారన్నారు. హాస్టల్‌లో కలుషిత ఆహారం తినడం వల్లే ఇలా జరిగిందని ఆరోపణలు రావడం పూర్తిగా అవాస్తవమన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

- సహస్ర హాస్పిటల్ వద్ద రోగి కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన
- ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న అనిల్ కుటుంబ సభ్యులు


మృతిచెందిన అనిల్ (ఫైల్)

కర్నూలు (హాస్పిటల్): వైద్యుల నిర్లక్ష్యం వల్లే రోగి మృతి చెందాడంటూ నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న సహస్ర హాస్పిటల్ వద్ద మృతుని కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఆందోళన చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం పందికుంట గ్రామానికి చెందిన అనిల్ (38) ప్రస్తుతం హైదరాబాదులో ఉంటూ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్యతో మూడేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. హైదరాబాద్‌లో కుమారుడు చరణ్‌ను బయోమెడికల్ ఇంజినీరింగ్ చదివిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆయనకు కడుపునొప్పి రావడంతో హైదరాబాద్‌లో ప్రాథమిక చికిత్స చేయించుకుని తెలిసినవారి సూచన మేరకు కర్నూలులోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న సహస్ర హాస్పిటల్‌లో చేరారు. ఇక్కడికి రాకముందు సమీపంలోని మరో ఆసుపత్రిలో చూపించగా పేగు మడత పడిందని, ఆపరేషన్‌కు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు. డబ్బులు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ ఉన్న సహస్ర హాస్పిటల్‌లో శనివారం చేర్పామన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు అనిల్ మృతిచెందినట్లుగా ఆసుపత్రి యాజమాన్యం చెప్పిందని, ముందే చెప్పి ఉంటే ఇంకా పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లేవాళ్లమని, సీనియర్ డాక్టర్లు కాకుండా జూనియర్ వైద్యులతో చికిత్స చేయడంతో మృతిచెందాడని ఆరోపించారు. ఈ మేరకు ఆసుపత్రి వద్ద సాయంత్రం ఆందోళన చేశారు. దీంతో మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనను నియంత్రించే ప్రయత్నం చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తూ ఆందోళన ఉద్ధృతం చేయడంతో పోలీసులకు, వారికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. తమ అనుమతి లేకుండా, తాము కేసు పెట్టకుండా మృతదేహాన్ని పోలీసులు ఎలా తీసుకెళ్తారని వారు ప్రశ్నించారు.

జపనీస్ కంపెనీల ప్రతినిధులతో ఆర్జీఎం డీన్ భేటీ

పాణ్యం: జపనీస్ కంపెనీల ఆర్‌జీఎం డైరెక్టర్ డాక్టర్ డీవీ అశోక్ కుమార్ శనివారం భేటీ అయ్యారు. బెంగుళూరులో కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన దక్షిణ రాష్ట్రాల సదస్సులో ఆయన పాల్గొన్నట్లు ఆర్‌జీఎం ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన బెంగళూరులో కర్ణాటక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జపాన్‌కు చెందిన పలు కంపెనీ సీఈఓ, రిక్రూట్మెంట్ మేనేజర్లతో సదస్సు నిర్వహించిందన్నారు. ఈ సదస్సులో జపాన్ కంపెనీలలో ఆర్జీఎం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరామన్నారు. దీనిపై జపాన్ కంపెనీ ప్రతినిధులు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిపారు. సదస్సులో జపాన్‌కు చెందిన మెకిక్యూరీ, హోండా మోటార్స్, బిగ్ ఫోర్, ఫోర్త్ వ్యాలీ, కన్సర్జ్ వంటి ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు.

ఓర్వకల్లు తహసీల్దార్ బదిలీ

ఓర్వకల్లు : మండల తహసీల్దార్ తహసీల్దార్ వెంకటరమణను బదిలీ చేస్తూ జిల్లా ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కేవలం మూడు నెలలు మాత్రమే ఇక్కడ పని చేసిన వెంకటరమణను నంద్యాల జిల్లా, గడివేముల మండలానికి బదిలీ చేశారు.